క్లుప్తంగా

పవర్ లిఫ్టింగ్‌లో భార్గవ్‌కు రజతం



భార్గవ్‌ను అభినందిస్తున్న మధుకుమార్, తదితరులు

సీతంపేట : కోనసీమ జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఇటీవల నిర్వహించిన ఛాంపియన్‌షిప్ పోటీల్లో బుల్లయ్య కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి పి.భార్గవ్ 120 కిలోల విభాగంలో రజత పతకం సాధించాడు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా కుంకుమ పూజలు



అఖండ దీపారాధనలో భక్తులు

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు పరిధి బాలయ్య శాస్త్రి లే అవుట్‌లో వద్ద ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ వర సిద్ధి వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వినాయక మండపంలో గురువారం మహిళలు కుంకుమ పూజలు చేశారు. అలాగే రాత్రి అఖండ దీపారాధన నిర్వహించారు. ఈ నెల 21న అనుపోత్సవం నిర్వహిస్తామని, పరిసర ప్రాంతాల భక్తులంతా పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

అలరించిన సంగీత విభావరి



లలిత గీతాలు ఆలపిస్తున్న సంస్థ సభ్యులు

సీతంపేట : స్వర రంజని సంగీత సాంస్కృతిక సంస్థ 35వ వార్షికోత్సవం సందర్భంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం లలిత సంగీత విభావరి నిర్వహించారు. సంస్థ అధ్యక్షురాలు లతా రాములు, ప్రధాన కార్యదర్శి గోల్కొండ రంగారావు, ఎంజీఎం ప్రసాద్, పి.సన్యాసినాయుడు, యోగ భాస్కర్, ఎం.అప్పారావు, చూడామణి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంస్థ సభ్యులు 40 లలిత గీతాలను మధురంగా ఆలపించి ప్రేక్షకులను అలరించారు. కార్యక్రమంలో బ్రహ్మాజీ, లక్ష్మీ ప్రసాద్, పద్మిని, ఎం.లక్ష్మిరెడ్డి, రూపవాణి, ఎంవీఆర్ నాగేశ్వరరావు, లక్ష్మి నాయుడు, లీలాకుమారి, చలము భాయి లలిత గీతాలు ఆలపించారు. సోమేష్ బృందం వాద్య సహకారం అందించారు.

రోడ్డెక్కిన మురుగుతో అవస్థలు



సీతంపేటలో రోడ్డెక్కిన మురుగు నీరు

సీతంపేట : జీవీఎంసీ 25వ వార్డు సీతంపేటలో రాధాకృష్ణ ఆలయం సమీపంలో డ్రెయిన్ బ్లాక్ అవడంతో మురుగు నీరు రోడ్డెక్కి ప్రవహించింది. మురుగు నీరు రోడ్డుపై నిలిచిపోవడంతో స్థానికుల ఫిర్యాదుతో పారిశుధ్య సిబ్బంది డ్రెయిన్‌లో అడ్డుపడిన చెత్త తొలగించారు. పెద్ద ఎత్తున డ్రెయిన్ నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలు బయట పడ్డాయి. తాగేసిన వాటర్ బాటిళ్లు, డ్రింక్ బాటిళ్లు, పాలిథిన్ కవర్లతో చెత్తను డ్రెయిన్‌లో పడేయడం వల్ల తరచూ బ్లాక్ అవుతోందని సిబ్బంది తెలిపారు. చెత్త, వ్యర్థాలు డ్రెయిన్‌లో పడేయకుండా సమీప డంపర్‌బిన్‌లో పడేసి సహకరించాలని కోరారు.

ఆఖరి మజిలీ అవస్థలమయం

- అధ్వానంగా 53వ వార్డు శివనగర్ శ్మశానవాటిక
- అసౌకర్యాల మధ్యే ఆత్మీయుల అంత్యక్రియలు
- లైట్లు లేక రాత్రివేళ చీకటిలోనే కర్మకాండలు



శ్మశానవాటికలో తుప్పలు, మొక్కలు



శివనగర్ శ్మశానవాటికలో శిథిలావస్థకు చేరుకున్న షెడ్డు



శ్మశానవాటికలో వెలగని హైమాస్క్ లైట్లు

మద్రిపాలెం : అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా నగరవాసి ఆఖరి మజిలీ కూడా అవస్థలమయమైపోయింది. ఆత్మీయుల అంతిమ సంస్కారాలు నిర్వహించే శ్మశానవాటిక అధ్వానంగా తయారవడంతో జీవీఎంసీ 53వ వార్డు శివనగర్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో నగరంలోని చాలా శ్మశాన వాటికలను పార్కుల మాదిరిగా అభివృద్ధి చేశారు. అంత్యక్రియలకు వచ్చే వారి కోసం అవసరమైన సౌకర్యాలు కల్పించారు. ఇందుకు భిన్నంగా శివనగర్‌లోని శ్మశానవాటిక అంధకారంతో స్థానికులను భయాందోళనకు గురి చేస్తోంది. ఆర్అండ్‌బీ దరి జాతీయ రహదారి సేవా మార్గంలో ఎఫ్‌సీఐ గొడౌన్ రోడ్డుకు కూతవేటు దూరంలో శివనగర్‌లో సుమారు రెండు ఎకరాల్లో విస్తరించి హిందూ శ్మశాన వాటిక ఉంది. ఇక్కడ కనీస సదుపాయాలు లేవు.

బిక్కుబిక్కుమంటూ చీకటిలోనే...

ఆర్అండ్‌బీ దరి జాతీయ రహదారి సేవా మార్గంలో పగటి వేళ అందరూ రాకపోకలు సాగించడంతో సందడిగానే ఉంటుంది. మరోవైపు శ్మశాన వాటికకు ఎదురుగా పట్టణ ఆరోగ్య కేంద్రం కూడా ఉండడంతో పగలు అందరూ ఉంటారు. అంతవరకూ బాగానే ఉన్నా సాయంత్రం 6 గంటలు దాటిదంటే చిమ్మ చీకటి అలుముకుంటోంది. శ్మశానంలో, పరిసర ప్రాంతాల్లో కనీసం లైట్లు కూడా వెలగడం లేదు. దీంతో అటుగా ప్రయాణించే వారు భయపడుతున్నారు. సాయంత్రం వేళ అంత్యక్రియలకు మృతదేహాలను తీసుకొచ్చే ఆత్మీయులైతే నరకయాతన అనుభవిస్తున్నారు. కనీస సదుపాయాలు లేకపోవడంతోపాటు చీకటిగా ఉండడంతో రాత్రి వేళ బిక్కుబిక్కుమంటూ కర్మకాండలు, అంత్యక్రియలు నిర్వహించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు చుట్టూ పిచ్చి మొక్కలు, చెట్లు వుండడంతో విషపురుగుల సంచారం అధికంగా ఉందని భయపడుతున్నారు. శ్మశాన వాటికలోకి కనీసం కుళాయి నీరు తెచ్చుకోవాలన్నా చెట్ల మధ్య నుంచే వెళ్లాల్సి వస్తోందని... తమ వారు మృతి చెందారనే బాధ ఒకవైపు, అంత్య క్రియలకూ సరైన సౌకర్యాలు లేవన్న బాధ మరోవైపు వెంటాడుతోందని వాపోతున్నారు. దహన సంస్కారం చేసే చోట రేకుల షెడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో వర్షం కురిసేటప్పుడు అంత్యక్రియలు నిర్వహించాలంటే చాలా ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఇందులోనే జీవీఎంసీ క్లాప్ వాహనాలు పార్కింగ్ చేసేస్తున్నారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రహరీ గోడ నిర్మించడంతో చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజలు ప్రశాంతంగా ఉన్నారని, లేదంటే చీకటి పడిన తర్వాత ఇళ్లలోకి ఎలాంటి విష పురుగులు వస్తాయో అని భయభ్రాంతులకు గురయ్యేవారిమని చెబుతున్నారు. సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ శ్మశాన వాటిక అభివృద్ధికి నోచుకోకపోవడంపై సర్వత్రా అసంతృప్తి చెందుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం పట్టించుకుని అభివృద్ధి చేయాలని, అవసరమైన సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు. తుప్పలు, చెట్లు తొలగించి విద్యుత్ లైట్లు అమర్చాలని వేడుకుంటున్నారు.

కనీస సదుపాయాలు లేవు

శివనగర్ శ్మశాన వాటికలో కనీస సదుపాయాలు లేవు. పిచ్చి మొక్కలు, తుప్పలు, చెట్లు పెరిగిపోవడంతో ఇబ్బందిగా వుంటుంది. దహన సంస్కారాలకు వచ్చేవారు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అవసరమైన సౌకర్యాలు కల్పించాలి.

– బాలాజీ, మద్రిపాలెం, 53వ వార్డు

నడవాలంటే భయమేస్తోంది

శివనగర్ శ్మశాన వాటికలో అంత్యక్రియలకు వచ్చే వారు లోపల నడవాలంటే హడలిపోతున్నారు. పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో విష పురుగులు సంచరిస్తున్నాయి. వర్షం కురిసినా, చీకటి పడినా అంత్యక్రియల నిర్వహణకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. లైట్లు వెలగక ఇబ్బందిగా ఉంది.

– కుమార్, శివనగర్, 53వ వార్డు

అక్షయ పాత్ర వంటశాల పరిశీలన



వంటశాల పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, తదితరులు

కంచరపాలెం : జీవీఎంసీ 54వ వార్డు ఐటీఐ జంక్షన్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో గల అక్షయ పాత్ర ఫౌండేషన్ వంటశాలను జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ గురువారం సందర్శించారు. జీవీఎంసీ పరిధిలో ఇటీవల ప్రారంభిస్తున్న అన్న క్యాంటీన్లకు భోజనాల సరఫరా బాధ్యతను హరే కృష్ణ మూవ్మెంట్ చారిటబుల్ ఫౌండేషన్‌కు అప్పగించడంతో వంటశాలను ఆయన పరిశీలించారు. ఆధునాతన పరికరాలతో వంట చేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. శుచి శుభ్రతా విధానాల్లో రాజీ పడొద్దని సూచించారు. అక్షయ పాత్ర ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ నిస్కించిన భక్తదాస్ వంట చేసే విధానాన్ని జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్‌కు వివరించారు. కార్యక్రమంలో యదురాజదాస్, రామ్మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మల తరలింపులో నిర్లక్ష్యం



రామకృష్ణానగర్‌లో వదిలేసిన చెట్ల కొమ్మలు



లలితానగర్‌లో వదిలేసిన చెట్ల కొమ్మలు

సీతంపేట : జీవిఎంసీ 26వ వార్డు పరిధి అక్కయ్యపాలెం, రామకృష్ణానగర్, లలితానగర్‌లోని పలు వీధుల్లో విద్యుత్ వైర్లకు తగులుతున్న చెట్ల కొమ్మలు తొలగించిన విద్యుత్ శాఖ అధికారులు వాటిని తరలించడం మాత్రం మర్చిపోయారు. పది రోజులు గడుస్తున్నా చెట్ల కొమ్మలు ఎక్కడివి అక్కడే వదిలేశారు. ఇళ్ల ముందు కొమ్మలు ఎండిపోయి, ఆకులు గాలికి ఎగురుతూ రోడ్డంతా వ్యాపిస్తున్నాయి. తరలించాలని జీవీఎంసీ పారిశుధ్య విభాగానికి స్థానికులు ఫిర్యాదు చేస్తున్నా ఎవరూ స్పందించడం లేదు. గతంలో చెట్ల కొమ్మలు తొలగించిన విద్యుత్ విభాగం వారే వాటిని తరలించేవారు. ప్రస్తుతం తరలింపు విషయంలో తీవ్రమైన జాప్యం చేస్తున్నారు. దీంతో పారిశుధ్య సిబ్బందిపై పని ఒత్తిడి పెరుగుతోంది. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు స్పందించి చెట్ల కొమ్మలు తరలించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆకస్మిక వర్షంతో ఉపశమనం



వర్షం కారణంగా వినియోగదారులు లేక ఖాళీగా ఉన్న సీతమ్మధార రైతుబజారు

సీతమ్మధార : నగరంలో గురువారం అకస్మాత్తుగా కురిసిన వర్షంతో రోడ్లు జలమయమయ్యాయి. కొద్ది రోజులుగా ఎండాకాలాన్ని మరిపించేలా సూర్యుడు ప్రతాపం చూపిస్తున్న విషయం తెలిసిందే. ఉక్కపోతతో సతమతమతున్న నగరవాసులకు గురువారం సాయంత్రం అకస్మాత్తుగా కురిసిన వర్షంతో ఉపశమనం లభించింది. నక్కవానిపాలెం, క్రాంతినగర్, గాంధీనగర్, రేసపువానిపాలెం, సత్యం జంక్షన్, టీపీటీ కాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్లు జలమయమయ్యాయి. 14వ వార్డులోని బాలయ్య శాస్త్రి లే అవుట్, నార్త్ ఎక్స్‌టెన్సన్, గణేష్‌నగర్, సీతమ్మధార, ఏఎస్ఆర్ నగర్, బిలాల్ కాలనీ, పీ అండ్ టీ కాలనీ, టీపీటీ కాలనీ, రాధాకృష్ణ లే అవుట్ తదితర ప్రాంతాల్లో రోడ్లన్నీ జలమయమయ్యాయి. సీతమ్మధార రైతుబజారులో వ్యాపారాలు సాగక వినియోగదారుల కోసం రైతులు ఎదురు చూశారు. నూడిల్స్, ఇతర చిరువ్యాపారాలు నిర్వహించే వారు తోపుడుబళ్లను తెరవలేదు.

మురళీనగర్ : మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో గురువారం సాయంత్రం కురిసిన వర్షంతో ప్రజలు ఉపశమనం పొందారు. ఉదయం నుంచి సూర్యుడు ప్రతాపం చూపడంతో విపరీతమైన ఎండ వేడిమికి ప్రజలు ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డారు. బస్సుల్లో ప్రయాణికులు, వాహన చోదకులు ఎండ వేడిమికి అవస్థలు పడ్డారు. పాఠశాల విద్యార్థులు తరగతి గదుల్లో ఉక్కపోతతో సతమతమయ్యారు. వృద్ధులు బయటకు రాకుండా ఇంటిలోనే ఉండాల్సి వచ్చింది. సాయంత్రం 4.45 గంటలకు ఆకాశం మేఘావృతమై వర్షం కురవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వాతావరణం చల్లబడడంతో సేద తీరారు.

బాలిక అదృశ్యం



వర్షిణి

మద్రిపాలెం : కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలిక అదృశ్యమైందని పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జ్ఞానాపురంలో తల్లితో కలిసి నివసిస్తున్న డి.వర్షిణి (17) బుధవారం సాయంత్రం నుంచి కనిపించ లేదు. ఇరుగుపొరుగు వారితో ఆడుకున్న తర్వాత ఇంటికి రాకపోవడంతో గురువారం రాత్రి పోలీసులకు తల్లి లక్ష్మి ఫిర్యాదు చేశారు. సదరు బాలిక ఐటీఐ చదువుతోంది. పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మద్రిపాలెం : జోన్ – 2 ఎస్ఎస్‌టీఎల్ సబ్‌స్టేషన్ పరిధి 11 కేవీ తెన్నేటి నగర్ ఫీడర్‌కు మరమ్మతులు నిర్వహిస్తున్నందున శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు కనకదుర్గా ఫంక్షన్ హాల్ జంక్షన్, మాధవధార, గాయత్రి విద్యా మందిర్ రోడ్డు, జనతా గ్యారేజీ జంక్షన్, గ్యాస్ గొడౌన్ జంక్షన్, సీతన్న గార్డెన్స్, నరసింహనగర్, ఎంఎస్ఆర్ పార్కు, విద్యానగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

51వ వార్డులో అన్నసంతర్పణ



అన్న ప్రసాదం వడ్డిస్తున్న 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, తదితరులు

మద్రిపాలెం : జీవీఎంసీ 51వ వార్డు సీతన్న గార్డెన్స్‌లో వినాయక చవితి మహోత్సవాలను పురస్కరించుకుని ప్రిన్స్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం మహా అన్న సమారాధన నిర్వహించారు. 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పాల్గొని అన్న సమారాధన ప్రారంభించారు. ముందుగా గణనాథుని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం కమిటీ సభ్యులు కార్పొరేటర్లను సత్కరించి వినాయకుడి చిత్రపటాలను అందజేశారు.

మహిళలకు కుట్టు శిక్షణ ప్రారంభం



కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలో గల బార్జిలయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు స్వయం ఉపాధి నిమిత్తం ఉచితంగా కుట్టు శిక్షణ ఇస్తున్నారు. మూడు నెలలపాటు శిక్షణ ఇస్తామని నిర్వాహకులు తెలిపారు. కొత్త బ్యాచ్ గురువారం నక్కవానిపాలెం 60 అడుగుల రోడ్డు దరి డీఎస్ఆర్ ఫంక్షన్ హాలులో ప్రారంభమైంది. బ్యాచ్‌కి ఐదుగురు మహిళలు వంతున రోజుకి రెండు బ్యాచ్‌లకు శిక్షణ ఇస్తున్నామని ఫౌండేషన్ అధినేత దుంగి చంద్రగిరి రెడ్డి, మజ్జి కిశోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు, ఉచితంగా కుట్టుమిషన్లు అందజేస్తామని తెలిపారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా పేద మహిళలకు పది కుట్టు మిషన్లు అందజేశామని తెలిపారు.

వరద బాధితులకు విరాళం



సరకులు విజయవాడకు పంపిస్తున్న డాక్టర్ సిస్టర్ షైజీ, తదితరులు

కంచరపాలెం : విజయవాడ వరద బాధితుల సహాయార్థం జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల యాజమాన్యం, సిబ్బంది రూ. లక్షా పాతిక వేలు విరాళం అందించారు. దీంతో బాధితులకు దుప్పట్లు, దోమతెరలు, కొనుగోలు చేసి విజయవాడ పంపించామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. కార్యక్రమంలో సిస్టర్ మేరీ, నాన్సీ, డాక్టర్ సుధ, పి.కె. విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నీచరాజకీయాలు మానుకోవాలి



చంద్రశేఖర్ యాదవ్

మద్రిపాలెం : చంద్రబాబు నీచ రాజకీయాలు మానుకోవాలని, కనీస విలువలు, విశ్వసనీయత లేని మనిషి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర బీసీ విభాగం ఇన్‌చార్జి డాక్టర్ తుల్లి చంద్రశేఖర్ యాదవ్ గురువారం ఓ ప్రకటనలో ఆరోపించారు. ముఖ్యమంత్రిగా కొనసాగే అర్హత చంద్రబాబుకు లేదన్నారు. అధికారంలోకి వచ్చి వంద రోజులవుతున్నా ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదని, పైగా డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. అత్యంత పవిత్రంగా భావించే తిరుమల లడ్డూపై విష ప్రచారం చేయడం సరి కాదని మండిపడ్డారు. అలిపిరి ఘటనలో దేవదేవుడి దయ వల్ల బతికి బయటపడి, ఇప్పుడిలా దారుణ వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. జంతువుల నూనెతో లడ్డూ ప్రసాదాన్ని తయారు చేశారని భక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా అనుచిత వ్యాఖ్యలు ఎలా చేస్తారని ప్రశ్నించారు. చంద్రబాబుకు దమ్ముంటే రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి విసిరిన సవాల్‌ను స్వీకరించి తిరుపతి వచ్చి ప్రమాణం చేయగలరా అని ప్రశ్నించారు. పవిత్రమైన తిరుమల ప్రసాదం మీద రాజకీయం చేయడం మానుకోవాలని సూచించారు.

జీవీఎంసీలో నియామకాల కోసం వినతి



ఎమ్మెల్యే కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన హిజ్రాలు

సీతమ్మధార : జీవీఎంసీలో హిజ్రాలకు వెంటనే నియామకాలు చేపట్టాలని పలువురు హిజ్రాలు కోరారు. ఈ మేరకు వారు బాలయ్య శాస్త్రి లే అవుట్‌లో గల ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కుమార్తె శ్యామల దీపికకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో జీవీఎంసీలో హిజ్రాలకు పోస్టింగ్‌ల ప్రక్రియ జరిగిందని గుర్తు చేశారు.

అప్పట్లో పారిశుధ్య కార్మికుల సమ్మె సమయంలో హిజ్రాలను జీవీఎంసీ అధికారులు పిలిపించడంతో అక్కయ్యపాలెం శ్రీనివాసనగర్‌లో పనిచేశామని తెలిపారు. గత మూడు నెలలుగా వేతనాలు కూడా ఇవ్వడం లేదని విచారం వ్యక్తం చేశారు. హిజ్రాలకు పారిశుధ్య పనుల నిర్వహణలో శిక్షణ కూడా ఇచ్చారని... శిక్షణ తర్వాత సర్టిఫికెట్లు ఇచ్చి నియామకాలు చేస్తామని అధికారులు చెప్పారని గుర్తు చేశారు. కానీ ఇప్పటి వరకు సర్టిఫికెట్లు ఇవ్వలేదని, నియామకాలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్‌కి వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేకపోయిందని విచారం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి తమకు పోస్టింగ్‌లు వచ్చేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కె.చందు, బి.మహాలక్ష్మి, ఎ.మంత్ర, కె.దీప్తిక, వి.రమేష్‌బాబు వినతిపత్రమిచ్చారు.

ఆర్గానిక్ దుస్తులతో ఆరోగ్యం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కె.ఎం.కె.రమేష్, లక్ష్మీ కొండాల

సీతంపేట : ఆర్గానిక్ దుస్తులతో ఆరోగ్యకరంగా జీవించవచ్చని నిత్ డిజైనర్స్ వ్యవస్థాపకురాలు లక్ష్మీ కొండాల అన్నారు. సేంద్రియ పత్తి, ప్రకృతి సిద్ధమైన రంగులతో పిల్లలకు ఆర్గానిక్ వస్త్రాలు రూపొందించామన్నారు. ఆర్గానిక్ దుస్తులపై అందరికీ అవగాహన కల్పించేలా వేర్ ద ఛేంజ్ నినాదంతో నవంబరు 10న సిరిపురం చిల్డ్రన్ ఎరీనాలో కిడ్స్ ఫ్యాషన్ షో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రచార పోస్టర్లు గురువారం శంకరమఠం రోడ్‌లోని వీ హెల్త్ కేర్‌లో డైరక్టర్ కె.ఎం.కె.రమేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పసిపిల్లల లేలేత చర్మ ఆరోగ్యానికి ఆర్గానిక్ దుస్తులు దోహదపడతాయన్నారు. ఆర్గానిక్ దుస్తులపై అవగాహన కలిగించేలా నిర్వహిస్తున్న కిడ్స్ ఫ్యాషన్ షోకు పాఠశాల విద్యార్థుల ఎంపిక జరుగుతుందన్నారు. ఆసక్తి కలవారు 79957 44495లో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో వీ హెల్త్ కేర్ చీఫ్ మేనేజర్ చిన్నం కృష్ణ, వైద్యులు ఇ.శ్రీవిద్య, తరుణ్ తేజ్, సీహెచ్.పార్వతి పాల్గొన్నారు.

జోన్–3 కమిషనర్‌గా శివప్రసాద్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న శివప్రసాద్

సీతమ్మధార: జీవీఎంసీ జోన్–3 కమిషనర్‌గా కె.శివప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఏలేశ్వరం కమిషనర్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికొచ్చారు. గతంలో ఇదే జోన్ కమిషనర్‌గా పనిచేసి బదిలీపై జోన్–4 కమిషనర్‌గా కొంతకాలం పనిచేసి, ఏలేశ్వరం మున్సిపల్ కమిషనర్‌గా ట్రాన్స్‌ఫర్ అయ్యారు. ఆశీలమెట్ట జోనల్ కార్యాలయంలో కొత్త జెడ్సీగా బాధ్యతలు చేపట్టిన శివప్రసాద్‌ను పలు విభాగాల అధిపతులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. వారిలో పబ్లిక్ వర్క్స్ ఈఈ డి.వి.రమణమూర్తి, ఏసీపీ ఎస్.వెంకటేశ్వరరావు, సహాయ వైద్యాధికారి ప్రసాదరావు, యూసీడీ ఏపీడీ దుర్గాప్రసాద్, రెవెన్యూ అసిస్టెంట్ కమిషనర్ ఎం.రమేష్, మలేరియా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఉన్నారు.

ప్రమాదకరంగా గొయ్యి



అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్‌లో ఏర్పడిన గొయ్యి

సీతంపేట : జీవీఎంసీ 44వ వార్డు పరిధి మహారాణి పార్లర్ కూడలికి వెళ్లే 80 అడుగుల రోడ్‌లో ఏర్పడిన పెద్ద గొయ్యి ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో శ్రీగణేష్ రెసిడెన్సీ ముందు రోడ్డు మధ్యలో పెద్ద గొయ్యి ఏర్పడింది. వాహన చోదకులు ఈ గోతిలో పడి ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే మార్గంలో నెలలు గడుస్తున్నా గోతిని పూడ్చేందుకు జీవీఎంసీ యంత్రాంగం ముందుకు రాలేదు. వర్షాలకు నీరు నిండి గొయ్యి కనిపించక ద్విచక్ర వాహనాలు జారి పడుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.